ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 325 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
శుక్రవారం 27 జూన్ 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# నైపుణ్యం పెంచుకొని స్మార్ట్ వర్క్ చేస్తే ఉద్యోగాలు ఎక్కడికీ పోవు:సీఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 27, (రిపబ్లిక్ న్యూస్):** యోగా డే నిర్వహణలో గిన్నిస్ రికార్డు సాధించామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. యోగా డేను ఘనంగా నిర్వహించడాన్ని ప్రధాని మోదీ కూడా ప్రశంసించారని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన టూరిజం కాంక్లేవ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మికవేత్తగా ఉన్న బాబా రామ్దేవ్ సమాజానికి సేవ చేస్తున్నారని కొనియాడారు. పర్యాటక శాఖకు సలహాదారుగా ఉండాలని బాబా రామవ్ను కోరారు. రాష్ట్రంలో పర్యాటకం అభివృద్ధి చెందేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు.



ఆగస్టు 15 లోగా అన్ని సేవలను ఆన్లైన్లో అందిస్తామని తెలిపారు. "భవిష్యత్తు అంతా పర్యాటక రంగానిదే అని ఎప్పుడో చెప్పా. టెంపుల్ టూరిజం మరింత అభివృద్ధి కావాలి. మన రాష్ట్రానికి అద్భుతమైన సముద్ర తీరం ఉంది. అనేక చోట్ల అందమైన అటవీ ప్రాంతం ఉంది. పాపికొండలు, కోనసీమ, హార్సిలీ హిల్స్ను మరింత అభివృద్ధి చేయాలి. మదనపల్లె దేశంలోనే గొప్ప వెల్నెస్ సెంటర్గా మారాలని కోరుకుంటున్నా. రాష్ట్రంలో వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని బాబా రామ్దేవ్ను కోరుతున్నా. యోగా, మెడిటేషన్.. గేమ్ఛేంజర్ కానున్నాయి.

## పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించిన ప్రభుత్వం మాదే

ప్రతి రంగంలో సంపద సృష్టించాలనేదే నా లక్ష్యం. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించిన ప్రభుత్వం మాదే. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి. విదేశాల్లో ఉన్న భారతీయుల్లో 35 శాతం తెలుగువాళ్లే. అక్కడ ఎక్కువ ఆదాయం పొందుతున్నదీ తెలుగువాళ్లే. దశాబ్దాల క్రితమే భారత్లో ఐటీ అభివృద్ధి గురించి బిలేట్పో చర్చించా. తర్వాత ఆయన హైదరాబాద్లో ఐటీ కేంద్రం ఏర్పాటు చేశారు. దేశంలో 1991 తర్వాత పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు తెచ్చారు. తర్వాత మన దేశంలో ఐటీ బాగా అభివృద్ధి చెందింది. దేశీయంగా తయారైన ప్రతి ఉత్పత్తిలో అంతర్జాతీయ స్థాయి ఉండాలి. సరైన సమయానికి సరైన వ్యక్తి మనకు ప్రధానిగా ఉన్నారు. మన దేశంలో బిలియనీర్లు బాగా పెరుగుతున్నారు. పేదవాళ్లను పైకి తెచ్చేందుకు అందరం కృషి చేయాలి. సరైన ప్రణాళికతో ముందుకెళ్తే ప్రజలే గొప్ప సంపదగా మారతారు. టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయని యువత భయపడుతున్నారు. నైపుణ్యం పెంచుకొని స్మార్ట్ వర్క్ చేస్తే ఉద్యోగాలు ఎక్కడికీ పోవు" అని చంద్రబాబు తెలిపారు.

# ఈ నెల 29న నిజామాబాద్‌కు అమిత్ షా

**నిజామాబాద్, జూన్ 27, (రిపబ్లిక్ న్యూస్):** ఈ నెల 29న కేంద్రమంత్రి అమిత్ షా నిజామాబాద్లో పర్యటించనున్నారు. నిజామాబాద్ లోని పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించనున్నారు. ఈ నెల 29న మధ్యాహ్నం ఒంటిగంటకు బేగంపేట విమానాశ్రయం చేరుకోనున్నారు. అక్కడి నుంచి నిజామాబాద్ పసుపు బోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. దీని కోసం భాజపా విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.

# జాన్‌పహాడ్ లిఫ్ట్ ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్

**హుజూర్‌నగర్, జూన్ 27, (రిపబ్లిక్ న్యూస్):** సూర్యాపేట జిల్లాలో మంత్రి ఉత్తమ్ కమార్ రెడ్డి పర్యటించారు. హుజూర్ నగర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. రూ.302 కోట్లతో నిర్మిస్తున్న జాన్పహాడ్ లిఫ్ట్ ప్రాజెక్టు పనుల గురించి ఆరా తీశారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# పూరీ జగన్నాథుడి రథయాత్రకు సర్వం సిద్ధం.. తరలివచ్చిన భక్తులు

**పూరీ, జూన్ 27, (రిపబ్లిక్ న్యూస్):** ఒడిశాలోని పూరీలో జగన్నాథుడి రథయాత్రకు సర్వం సిద్ధం చేశారు. పూరీ నగర వీధులు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. రథయాత్రను చూసేందుకు దేశ, విదేశాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ వేడుక కోసం ఒడిశా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. రథయాత్రకు 12 లక్షల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా. ప్రస్తుతం పూరీలో జగన్నాథుని పోహండి ప్రారంభమైంది. అంతకు ముందు సుదర్శన, బలభద్ర, సుభద్రల వేడుక జరిగింది. దీంతో ఆ ప్రాంతమంతా జనసంద్రంగా మారింది.

హుస్నాబాద్‌లో నలుగురు మంత్రుల పర్యటన

మరోవైపు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో నలుగురు మంత్రులు పర్యటించారు. తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్ కలిసి ఇక్కడ మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

# మళ్లీ ఫోన్ ట్యాపింగ్ జరగకూడదంటే.. కేసీఆర్, కేటీఆర్‌కు శిక్షపడాలి:విశ్వేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 27, (రిపబ్లిక్ న్యూస్):** ఫోన్ ట్యాపింగ్ పై ఫిర్యాదు చేసినందుకే తనపై తప్పుడు కేసులు పెట్టారని భాజపా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసినందుకు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ జైలుకు వెళ్లాలన్నారు. ఈ కేసు విచారణలో భాగంగా శుక్రవారం ఆయన సిట్ ఎదుట హాజరయ్యారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఆయన్ని అధికారులు ప్రశ్నించారు. వాంగ్మూలం నమోదు చేసుకున్నారు.

అనంతరం విశ్వేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ నిరూపించేందుకు అవసరమైతే కేంద్రం సాయం తీసుకోవాలన్నారు. ఈ అంశాన్ని పార్లమెంట్లో లేవనెత్తుతాం. మళ్లీ ఫోన్ ట్యాపింగ్ జరగకుండా ఉండాలంటే కేసీఆర్, కేటీఆర్కు శిక్షపడాలి. గతంలో నా ఫోన్ చాలాసార్లు ట్యాప్ అయ్యింది. దీనిపై గతంలోనూ నేను ఫిర్యాదు చేశాను" అని విశ్వేశ్వర్రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ విశ్వేశ్వర్రెడ్డి ఫోన్ ట్యాపింగ్ అయినట్లు అధికారులు కూడా గుర్తించారు. సీడీఆర్ లిస్టులో ఆయన నంబర్ ఉన్నట్లు సిట్ తెలిపింది.

# స్వేచ్ఛను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోవద్దు:జైశంకర్

**జూన్ 27, (రిపబ్లిక్ న్యూస్):** ఒకే ఒక్క కుటుంబం వల్ల దేశంలో అత్యయిక పరిస్థితి ఏర్పడిందంటూ కేంద్ర మంత్రి జైశంకర్ కాంగ్రెస్ను పరోక్షంగా దుయ్యబట్టారు. కుర్చీ కోసం వారు ఏదైనా చేస్తారంటూ విమర్శలు గుప్పించారు. ఎమర్జెన్సీ ప్రకటించి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ హయాంలో విధించిన ఎమర్జెన్సీ వల్ల దేశవ్యాప్తంగా చాలామంది జైళ్లలో మగ్గాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు.

దేశంలో కాంగ్రెస్ హయాంలో అవినీతి పెరిగిపోవడం, ద్రవ్యోల్బణం ఎక్కువవడం వల్ల ప్రభుత్వానికి ప్రజాదరణ బాగా పడిపోయిందని జైశంకర్ అన్నారు. స్వేచ్ఛను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోవద్దనే పాఠాన్ని అత్యవసర పరిస్థితి నుంచి దేశం నేర్చుకుందని అన్నారు. అంతర్గత కారణాల వల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లినట్లు పేర్కొంటూ నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీఅహ్మద్ 50 ఏళ్ల క్రితం 1975 జూన్ 25న ఎమర్జెన్సీ ప్రకటించారని జైశంకర్ పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ భారత రాజ్యాంగ విలువలను పక్కన పెట్టిందని.. ప్రజల ప్రాథమిక హక్కులు నిలిపివేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అప్పట్లో దేశ పౌరులు, పత్రికల ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ తీవ్ర అణచివేతకు గురయ్యాయని, సుమారు 1.5 లక్షల మంది జైలు పాలైనట్లు తెలిపారు. అందువల్లే జూన్ 25ను 'సంవిధాన్ హత్య దివస్'గా జరుపుకున్నామన్నారు. కొంతమంది వ్యక్తులు రాజ్యాంగాన్ని పట్టుకొని ప్రజల్లో తిరుగుతారే కానీ.. వారి ఉద్దేశాలు మాత్రం రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా ఉంటాయని విమర్శించారు. తాము చేసిన తప్పుల గురించి కాంగ్రెస్ నేతలు ఎప్పుడూ విచారం వ్యక్తంచేయరని.. వారి నిర్ణయాలు తప్పని ఒప్పుకోరని దుయ్యబట్టారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితికి 50 ఏళ్లు పూర్తవడంతో నాటి పరిస్థితులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహించింది. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య హక్కులు, ఎమర్జెన్సీ నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించినట్లు కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఇందులోభాగంగా అత్యవసర పరిస్థితికి సంబంధించిన అన్ని చట్టపరమైన రికార్డులను సేకరించి.. భావితరాల కోసం వాటిని భద్రపరచాలని ప్రధాని మోదీ అధికారులను ఆదేశించారు.

# అంతర్జాతీయ ఆర్బిట్రేషన్‌కు భూ కేటాయింపులు రద్దు చేసిన హైకోర్టు

**హైదరాబాద్, జూన్ 27, (రిపబ్లిక్ న్యూస్):** అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ) కు చేసిన భూ కేటాయింపులను హైకోర్టు రద్దు చేసింది. శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని సర్వే నెంబరు 83/1లో 3.5 ఎకరాలకు పైగా భూమిని కేటాయిస్తూ జారీ చేసిన జీఓను హైకోర్టు కొట్టేసింది. ఐఏఎంసీకి భూమిని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ రెండు వేర్వేరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి.

న్యాయవాది కె.రఘునాథ్వు, వెంకటరాత్రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ కె. సుజనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్లపై జనవరిలో వాదనలు ముగిశాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ సంస్థకు భూకేయింపు చేశారని న్యాయవాది రఘునాథ్ రావు కోర్టుకు తెలిపారు. ఐటీ కారిడార్లో రూ.350 కోట్ల విలువ చేసే భూమిని సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా కేటాయించారని వాదించారు. అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్ను హైదరాబాద్లో ఏర్పాటు చేస్తే పలు అంతర్జాతీయ సంస్థల మధ్య వివాదాల పరిష్కారానికి దోహదపడుతుందని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. వివాదాలు కేవలం న్యాయస్థానాల్లోనే కాకుండా.. బయట కూడా పరిష్కరించుకోవచ్చని న్యాయస్థానాలే చెబుతున్నాయన్నారు. ఐఏఎంసీ వల్ల వివాదాలు పరిష్కారమైతే కోర్టులపై కూడా భారం తగ్గుతుందన్నారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో జనవరిలో తీర్పును రిజర్వు చేసిన హైకోర్టు శుక్రవారం వెలువరించింది. ఐఏఎంసీ భూకేటాయింపుతో పాటు, ప్రస్తుత భవనం నిర్వహణ కోసం జారీ చేసిన జీఓలను కూడా హైకోర్టు కొట్టేసింది.

# విజయవాడలో టూరిజం కాన్‌క్లేవ్.. క్యారవాన్లు ప్రారంభించిన సీఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 27, (రిపబ్లిక్ న్యూస్):** నగరంలో ఏర్పాటు చేసిన టూరిజం కాన్ క్లేవ్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ప్రముఖ యోగా గురువు బాబా రామేవ్తో కలిసి పర్యటక క్యారవాన్లు ప్రారంభించారు. టూరిజం రంగంలో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పర్యాటక ప్రాజెక్టులకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక హోదా కల్పించింది. పర్యాటకాభివృద్ధి సంస్థ రూ. 10,039 కోట్ల పెట్టుబడులపై ఒప్పందం కుదుర్చుకోనుంది. విశాఖ, అమరావతి, తిరుపతిలో హోటళ్ల నిర్మాణానికి ఒప్పందం జరగనుంది. కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేశ్, ఎంపీ కేశినేని చిన్ని పాల్గొన్నారు.

## పర్యాటక రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు:దుర్గేశ్

వైకాపా హయాంలో పర్యాటకరంగం పూర్తిగా నిరాదరణకు గురైందని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ఏ అవకాశం వదలకూడదనే సీఎం సూచనలతో ముందుకువెళ్తున్నట్లు చెప్పారు. పర్యాటకరంగంలో యువతకు మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తాం. ప్రైవేట్ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులకు అవకాశం ఉన్న రంగం ఇది. 974 కి.మీ పొడవైన సముద్రతీరం ఉంది. పర్యాటకాభివృద్ధికి ఇదో అద్భుత అవకాశం" అని దుర్గేశ్ అన్నారు.

# అనంతపురం జిల్లాలో భారీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు

**అమరావతి, జూన్ 27, (రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం జిల్లాలో భారీ పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. గిన్ఫ్రా ప్రెసిషన్స్ సంస్థ తిమ్మసముద్రంలో పరిశ్రమ ఏర్పాటు చేయనుంది. రూ.1,150 కోట్లతో బైమాడ్యులర్ ఛార్జ్ సిస్టమ్స్ తయారీ యూనిట్ నెలకొల్పనుంది. ఈ పరిశ్రమకు ఎకరం రూ.8.30లక్షల చొప్పున 121.53 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. భూమి స్వాధీనం చేసుకున్న 14 నెలల్లో ఉత్పత్తి చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. పరిశ్రమ ఏర్పాటుతో 299 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

# గుంటూరులో పోలీసు ఏఐ హ్యాకథాన్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు

**గుంటూరు, జూన్ 27, (రిపబ్లిక్ న్యూస్):** గుంటూరులోని ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీసు ఏఐ హ్యాకథాన్ ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. పోలీసుశాఖలో కృత్రిమమేధ వినియోగంపై మూడు రోజుల పాటు హ్యాకథాన్ కొనసాగనుంది.

తొలుత అమరావతి నుంచి హెలికాప్టర్లో గుంటూరు చేరుకొన్న చంద్రబాబుకు.. కొత్తపాలెంలోని జిందాల్ ఫ్యాక్టరీ వద్ద గుంటూరు జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, హోం మంత్రి వంగలపూడి అని, డీజీపీ హరీష్కుమార్ గుప్తా, పలువురు ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1838: వందేమాతర గీత రచయిత బంకించంద్ర ఛటర్జీ జననం (మ.1894). (చిత్రంలో)
- 1880: అంధులకు, బధిరులకు, మూగవారికి వారధిగా, వికలాంగుల ఉద్యమాల సారధిగా ప్రపంచ స్థాయిలో పేరొందిన హెలెన్ కెల్లర్ జననం (మ.1968).
- 1939: ప్రజల నేత, హైకోర్టు న్యాయవాది. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకుడు. హేతువాది బొజ్జా తారకం జననం (మ.2016).
- 1967: ఇంగ్లాండు లోని ఎన్‌ఫీల్డ్ నగరంలో మొట్టమొదటి ఎ.టి.ఎం యంత్రాన్ని ప్రవేశపెట్టారు.
- 2008: సాహసోపేత భారత సైనికుడు, జాతీయ హీరో ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా మరణం (జ.1914).
- 1978: సహకార రంగానికి ఎనలేని సేవచేసిన జవ్వాది లక్ష్మయ్యనాయుడు మరణం (జ.1901).
- 1980: తెలుగు రంగస్థల నటి సురభి ప్రభావతి జనవరి.
- 2009: న్యాయ శాస్త్ర కోవిదుడు, మాజీ లోక్‌సభ సభ్యుడు, రాష్ట్ర మంత్రి ఏరాసు అయ్యపురెడ్డి మరణం.

బంకించంద్ర ఛటర్జీ


హెలెన్ కెల్లర్

బొజ్జా తారకం

ఎ.టి.ఎం

మార్షల్ మానెక్‌షా


జవ్వాది లక్ష్మయ్యనాయుడు

సురభి ప్రభావతి

ఏరాసు అయ్యపురెడ్డి

## నెవ్వర్ బిఫోర్ పాత్రలో రష్మిక.. కొత్త ప్రాజెక్ట్ ప్రకటన

'కుబేర'తో తాజాగా విజయాన్ని సొంతం చేసుకున్న రష్మిక ఇప్పుడు మరో ఆసక్తికర ప్రాజెక్టు ప్రకటించారు. 'మైసా' అనే సినిమాతో రానున్నారు. రవీంద్ర పూలే దీనికి దర్శకత్వం వహించనున్నారు.

ఐదు భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. టైటిల్ పోస్టో రష్మిక భయంకరమైన అవతారంలో కనిపించి ఆసక్తి పెంచారు. ఈ చిత్రాన్ని అన్నార్ముల ఫిల్మ్స్ నిర్మిస్తోంది. "ధైర్యం ఆమె బలం. సంకల్పంలో లేదు కనికరం.. ఆమె గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి"..! అంటూ నిర్మాణసంస్థ పోస్టర్ షేర్ చేసింది. ఇందులో రష్మిక వారియర్గా కనిపించనున్నట్లు పోస్టర్ చూస్తే అర్థమవుతోంది. "నేను ఎప్పుడూ కొత్తది, భిన్నమైనది. ఉత్తేజకరమైన చిత్రాలకు ప్రాధాన్యమిస్తాను. 'మైసా' అలాంటి వాటిలో ఒకటి. నేను ఇంతకు ముందెప్పుడూ పోషించని పాత్ర. ఎప్పుడూ అడుగుపెట్టని ప్రపంచం. ఇప్పటి వరకూ చేయని వెర్షన్. ఈ సినిమాను మీ ముందుకు తీసుకురావడానికి ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను. ఇది ఆరంభం మాత్రమే.." అంటూ రష్మిక ఈ సినిమా వివరాలు పంచుకున్నారు. ఇటీవల కాలంలో రష్మిక నటించిన సినిమాల్లో 'సికందర్' మినహా మిగిలినవన్నీ బ్లాక్ బస్టర్గా నిలిచాయి. కుబేర కూడా రూ.100 కోట్ల క్లబ్లో చేరింది. ప్రస్తుతం ఆమె లైనప్ ఆసక్తికరంగా ఉంది. రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తున్న నాయికా ప్రాధాన్య చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'లో నటిస్తున్నారు. అలాగే, బాలీవుడ్ కథానాయకుడు ఆయుష్మాన్ ఖురానాకు జంటగా 'థామా'తో పలకరించనున్నారు. దీనికి ఆదిత్య సర్పోల్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. అతీంద్రియ శక్తులతో కూడిన ఓ రొమాంటిక్ చిత్రంగా ఇది రూపొందుతోంది. ఇప్పుడు 'మైసా'ను ప్రకటించారు. వీటి తర్వాత భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'పుష్ప2'కు సీక్వెల్లోనూ ఈ బ్యూటీ నటించనున్నారు.

## ఆస్కార్ అకాడమీలో కమల్ హాసన్కు చోటు..

భారతీయ నటులు కమల్ హాసన్, ఆయుష్మాన్ ఖురానా గ్లోబల్ క్లబ్లో భాగమయ్యారు. ఆస్కార్ అకాడమీలోకి వీరికి ఆహ్వానం లభించింది. ఎంతోమంది హాలీవుడ్ నటీనటులతో పాటు ఆస్కార్ ఓటింగ్ ప్రక్రియలో మన నటులు భాగమయ్యారు. ఈ ఏడాది ఆస్కార్ అకాడమీలో చోటుపొందిన వారి జాబితాను ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ తాజాగా విడుదల చేసింది. ఇందులో నటులు కమల్ హాసన్, ఆయుష్మాన్ ఖురానాలతో పాటు దర్శకురాలు పాయల్ కపాడియా, భారతీయ ఫ్యాషన్ డిజైనర్ మాక్సిమా బసు కూడా ఉన్నారు. ఆస్కార్కు నామినేట్ అయ్యే చిత్రాల్లో ఫైనల్ ఎంపిక ప్రక్రియలో వీరికి ఓటు వేసే అవకాశాన్ని కల్పించింది. ఈ ఏడాది కొత్తగా 534 మంది సభ్యులను ఆహ్వానించినట్లు అకాడమీ తెలిపింది. ప్రతిభావంతులైన వీరికి అకాడమీలో చోటు కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొంది. 19 ఇతర విభాగాల్లోని నటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలను ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ఆహ్వానించింది. ఈ సంవత్సరం చోటు సొంతం చేసుకున్న 534 మందిలో 41 శాతం మంది మహిళలు ఉన్నట్లు తెలిపింది. ఇక వచ్చే ఏడాది మార్చి 15న ఆస్కార్ వేడుక జరగనుంది. జనవరి 12 నుంచి 16 వరకూ నామినేషన్ ప్రక్రియ జరగుతుంది. నామినేషన్ల పరిశీలన తర్వాత తుది జాబితాను జనవరి 22న ప్రకటించనున్నారు.

## రిపబ్లిక్ సినిమా CINEMA

## ఈ క్షణం కోసం జీవితమంతా ఎదురుచూశాను :'కన్నప్ప' రిలీజ్ వేళ విష్ణు పోస్ట్

మంచు విష్ణు కలల ప్రాజెక్ట్ రూపొందిన కన్నప్ప నేడు ప్రేక్షకుల ముందుకువచ్చింది. పదేళ్లకు పైగా ఆయన ఈ సినిమా కోసం కష్టపడ్డారు. నేడు దీని ప్రీమియర్లు వస్తోన్న పాజిటివ్ స్పందనలపై ఆయన స్పందించారు. ఎక్స్ వేదికగా ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. "ఈ క్షణం కోసం జీవితమంతా ఎదురుచూశాను. ఓవర్సీస్ ప్రీమియర్స్ , ఇండియాలో మొదటి ఆటకు వస్తోన్న పాజిటివ్ రెస్పాన్స్, ఆడియన్స్ ఈ సినిమాపై చూపుతోన్న ప్రేమను చూస్తోంటే నా హృదయం కృతజ్ఞతా భావంతో నిండిపోతుంది. 'కన్నప్ప' ఇక నా సినిమా కాదు.. ఈ క్షణం నుంచి ఇది మీ సినిమా" అని తన పోస్టో రాసుకొచ్చారు. ఇక ఇందులో కిరాత పాత్రలో నటించిన మోహన్లాల్ కూడా సినిమాపై పోస్ట్ పెట్టారు. అందరూ దగ్గర్లోని థియేటర్ లో 'కన్నప్ప'ను చూడాలని కోరారు. "కన్నప్ప ఇప్పుడు బిగ్ స్క్రీన్ పైకి వచ్చేశాడు. భక్తి కోసం తన నేత్రాన్నే కాదు.. తన జీవితాన్ని కూడా అంకితం చేసిన గొప్ప వ్యక్తి. ఇప్పుడు మిమ్మల్ని కూడా భక్తి పారవశ్యంలో ఓలలాడిస్తాడు" అంటూ ప్రభాస్ తన సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. శివ భక్తుడు కన్నప్ప జీవితాధారంగా దర్శకుడు ముకేశ్ కుమార్ సింగ్ ఈ సినిమాను తెరకెక్కించారు. తిన్నడు/కన్నప్పగా విష్ణు నటించగా రుద్రగా ప్రభాస్, కిరాతగా మోహన్లాల్, శివుడిగా అక్షయ్కుమార్, పార్వతిగా కాజల్ అగర్వాల్, మహాదేవశాస్త్రిగా మోహన్ బాబు నటించారు. దీనికి క్లైమాక్స్ హైలైట్ అని ఎక్స్ వేదికగా సినీ ప్రియులు రివ్యూ ఇస్తున్నారు. ప్రభాస్ ప్రత్యేక ఆకర్షణ అని, చివరి 20 నిమిషాలు మంచు విష్ణు నటన అద్భుతమంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.


ప్రజా రిపబ్లిక్ దినపత్రిక
9948814188, 9985876888

ప్రకటన

ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాప్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501

డోర్ నెం:46/161/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001

బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్


## రిపబ్లిక్ స్పోర్ట్స్

# బుమ్రాకు కాస్త మద్దతు ఇవ్వండి: భారత బౌలర్లకు షమీ సూచన

ఇంగ్లాండ్ తో లీడ్స్ టెస్టులో భారత బౌలింగ్ బలహీనత బయటపడింది. తొలి ఇన్నింగ్స్ లో బుమ్రా ఐదు వికెట్ల ప్రదర్శనతో రాణించినా.. రెండో ఇన్నింగ్స్ లో ఒక్కవికెట్టూ దక్కలేదు. సిరాజ్, ప్రసిద్ధ కృష్ణ కాస్త ఎక్కువగా పరుగులు ఇవ్వడం భారత్కు నష్టం చేసింది. దీంతో 370ం టార్గెట్ను కాపాడుకోవడంలో విఫలమైంది. ఈ క్రమంలో బుమ్రా మినహా మిగతా టీమ్ ఇండియా బౌలింగ్ యూనిట్పై మహ్మద్ షమీ అసహనం వ్యక్తం చేశాడు. బుమ్రాకు మద్దతుగా ఇవ్వాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించాడు.



"భారత బౌలర్లు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. జస్ప్రీత్ బుమ్రాతో మిగతా బౌలర్లు మాట్లాడాలి. అతడి నుంచి నేర్చుకోవాలి. ఎలా బౌలింగ్ చేయాలనేది ప్రణాళిక వేసుకోవాలి. అతడికి మద్దతుగా ఉండాలి. అప్పుడే మనం సులువుగా విజయం సాధించగలం. నేను తొలి మ్యాచ్ గురించి మాట్లాడుతున్నా. బౌలింగ్ విభాగంపై మరింత వర్కౌట్ చేయాలి. శార్దూల్ ఠాకూర్, ప్రసిద్ధ కృష్ణ రెండో ఇన్నింగ్స్లో రెండేసి వికెట్లు తీశారు. శార్దూల్ స్వల్ప వ్యవధిలో వికెట్లు తీసినా.. అప్పటికే భారత్ చేతుల్లో మ్యాచ్ లేదు. కొత్త బంతితో వికెట్లు తీయడం ముఖ్యం. బుమ్రాకు సపోర్ట్ ఇవ్వాలి. ఇంగ్లాండ్ తొలి టెస్టులో విజయం సాధించడానికి కారణం భారత బౌలర్లు సులువుగా పరుగులు ఇవ్వడమే. మన బౌలింగ్ విభాగం మరింత బలంగా తయారు చేయడానికి ఏం చేయాలనేది మార్గాలను వెతకాలి" అని షమీ వ్యాఖ్యానించాడు. జులై 2 నుంచి ఎడ్జ్బాస్టన్ మైదానం వేదికగా ఇంగ్లాండ్ - భారత్ జట్ల మధ్య రెండో టెస్టు జరగనుంది. ఈ మ్యాచ్లో జస్ప్రీత్ బుమ్రా ఆడటంపైనా అనుమానాలు నెలకొన్నాయి. అతడిపై పనిభారం లేకుండా చేయాలనే ఉద్దేశంలో టీమిండియా మేనేజ్మెంట్ ఉంది. అందుకే, మూడు టెస్టుల్లోనే ఆడించాలని భావిస్తోంది. అందుకే రెండో టెస్టుకు అతడికి విశ్రాంతి ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై అధికారికంగా ఇప్పటి వరకు బీసీసీఐ నుంచి స్పష్టత రాలేదు.

## ఆరోగ్యం

## రోటీ, చపాతీలపై నెయ్యి రాసి తింటున్నారా, మీకు మీరే ప్రాబ్లమ్స్ తెచ్చుకుంటున్నట్లే, ఎందుకంటే

చపాతీ, రోటీపై నెయ్యి వేసి తినడం చాలా మందికి ఇష్టమే. మరికొంతమంది దీనిపై కొద్దిగా పంచదార కూడా వేసి తియ్యగా ఎంజాయ్ చేస్తారు. అయితే, ఇలా తినడం మంచిది అని కొంతమంది అంటే మరికొంతమంది ఇలా తినడం వల్ల సమస్యలొస్తాయని చెబుతున్నారు. ఆచార్య బాలకృష్ణ దీని గురించి ఏం చెబుతున్నారంటే

అన్నీ రకాల కొవ్వులలో నెయ్యి హెల్దీ ఫ్యాట్. ఇది బాడీలో మంచి కొలెస్ట్రాల్ని పెంచుతుంది. దీని వల్ల జీర్ణ సమస్యలు తగ్గుతాయి. ఇమ్యూనిటీ పెరుగుతుంది. నెయ్యిలోని విటమిన్స్ ఎ, డి, ఇ, కె వంటి పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. దీనిని తినడం వల్ల శరీరానికి శక్తి అందుతుంది. ఎక్కువసేపు కడుపు నిండినట్లుగా ఉంటుంది. కొంతమంది ఎక్స్పర్ట్స్ ప్రకారం నూనె బదులు నెయ్యిని వాడితే చాలా మంచిది. అందుకోసమే మనం నెయ్యిని వంటల్లో భాగంగా చేస్తాం. నెయ్యిని ఇష్టపడేవారు ఇడ్లీ, దోశలు, ఇలా ఏ టిఫిన్స్లో అయినా నెయ్యిని యాడ్ చేసి తింటారు. ఇక చపాతీలు తినేటప్పుడు కూడా కాస్తా వేడిగా ఉన్నప్పుడే నెయ్యి రాసి తింటారు. దీని వల్ల చపాతీ, రోటీల రుచి పెరగడమే కాకుండా మంచిదని తింటారు. కానీ, ఇది అస్సలే మంచిది కాదని చెబుతున్నారు ఆచార్య బాలకృష్ణ. నెయ్యి స్వతహాగా మంచిదే అయినప్పటికీ చపాతీలపై రాసి తినడం మంచిది కాదని చెబుతున్నారు.

### చపాతీలపై నెయ్యి

మన తినే ఫుడ్లో అన్నంతో పాటు చపాతీలు, రోటీలు కూడా ఓ భాగమైపోయాయి. బరువు తగ్గాలనుకునేవారు రోటీ, చపాతీలని ఎక్కువగా తింటారు. అయితే, వీటిని కాస్తా రుచిగా తినాలనుకునేవారు చపాతీలపై కాస్తా నెయ్యి రాసి తింటారు. ఇదివరకూ ఇలా చేయడం మంచిదని చెప్పేవారు. కానీ, రాన్రాను కొన్ని సమస్యలు కూడా ఉన్నాయని చెబుతున్నారు.

### నెయ్యి

నెయ్యి మనకి లభించిన గొప్ప వరమని చెప్పొచ్చు. దీనిని వంటల్లో వాడడమే కాకుండా, పూజల్లోనూ వాడతారు. అంతేకాదు, దీనిలోని గుణాల కారణంగా అందాన్ని పెంచడంలో కూడా వాడతారు. ఇలా ఎన్నో ప్రయోజనాలున్న నెయ్యిని చాలా ఆరోగ్య సమస్యల్ని దూరం చేయడం దగ్గర్నుంచీ అందాన్ని కాపాడడం వరకూ వాడొచ్చు. దీనిని తీసుకోవడం వల్లపేగు ఆరోగ్యం మెరుగ్గా మారుతుంది. ఎముకలు బలంగా మారతాయిఇమ్యూనిటీ పెరుగుతుందిజీర్ణ సమస్యలు కూడా తగ్గుతాయి. బరువుని మెంటెయిన్ చేయడంలో నెయ్యికి ప్రత్యేక స్థానంమూల వ్యాధులు తగ్గడందగ్గుకి చెక్గుండె సమస్యలకి మంచిదిమెరుగైన జ్ఞాపకశక్తినొప్పి నివారణిగా కూడా పనిచేస్తుంది.

### ఆచార్య బాలకృష్ణ ప్రకారం

పతంజలి యోగాపీఠం అధిపతి ఆచార్య బాలకృష్ణ ప్రకారం నెయ్యి రోటీలపై రాసి తినడం మంచిది కాదు. ఇదే విషయం తన యూట్యూబ్ ఛానెల్లో షేర్ చేసిన వీడియోలో చెబుతున్నారు. నెయ్యి తింటే చాలానే లాభాలు ఉంటాయి. అలానే చపాతీలు కూడా మంచిదే. కానీ, రెండింటిని కలిపి తినకూడదని చెబుతున్నారు.

### ఎందుకు వద్దు

బాలకృష్ణ ప్రకారం, రోటీ మీద నెయ్యి పూయడం వల్ల ఓ లేయర్లా ఏర్పడుతుంది. ఇది జీర్ణమవ్వడానికి కష్టమవుతుంది. ఈ పొర ఆహారాన్ని సరిగ్గా జీర్ణమవ్వనివ్వదు. దీని కారణంగా గ్యాస్, అజీర్ణం, బరువుగా అనిపించడం వంటి సమస్యలొస్తాయి. ఇలా తిన్న రోటీలు త్వరగా అస్సలు జీర్ణమవ్వవు. అంతేకాకుండా గ్యాస్ పట్టేసినట్లుగా చాలా ఇబ్బందిగా ఉంటుంది.

### ఎలా తినాలి

మీరు నెయ్యితో రోటీ తినాలనుకున్నప్పుడు చపాతీలపై నెయ్యి వేయకుండా మీరు తినే పప్పు, కూరల్లో నెయ్యి వేసి తినండి. దీని వల్ల ఎలాంటి సమస్యలు రావు. జీర్ణ సమస్యలు అసలే రావు. పైగా రుచి అలానే ఉంటుంది. అయితే, మరీ ఎక్కువగా వేయొద్దొని గుర్తుంచుకోండి. దీంతో కూడా చాలాసమస్యలొస్తాయి.

### రోటీలు మెత్తగా రావాలంటే

ఇక రోటీలు మెత్తగా ఉండాలనుకుంటే పిండిని కలిపినప్పుడే నెయ్యి వేయండి. ఇలా చేస్తే రోటీలు మృదువుగా ఉంటాయి. ఈజీగా జీర్ణమవుతాయి. రోటీలపై నెయ్యి రాసే బదులు ఇది బెస్ట్ ఆప్షన్. కాబట్టి, ఇక నుంచి ఇలా చేసి చూడండి. దీంతో ఎక్కువ సమయమైనా రోటీలు గట్టిగా కావు. మెత్తగానే ఉంటాయి.

గమనిక: ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి.